ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
# ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 2 డిసెంబరు 2024


పెదవేగి మండలంలో ధాన్యం రాశులపై నీటిని తోడుతున్న మహిళ

# ఫెంగల్ బెంగ




కలిదిండి మండలంలో నేలనంటిన వరి

## నేలకొరిగిన వరి.. తడిచిన ధాన్యం

- వీడని వర్షం.. అన్నదాత గగ్గోలు
- 97,523 ఎకరాల్లో వరి కోతలు
- రహదారులపై ధాన్యం రాశుల్లో నీరు
- తేమశాతంతో ధరపై ఆందోళన
- పంట కాపాడుకోడానికి రైతుల పాట్లు
- వ్యసాయాధికారుల పరిశీలన

ముదినేపల్లి / కలిదిండి / కైకలూరు, చింతలపూడి / పోలవరం / ఏలూరురూరల్ / పెదవేగి / కొయ్యలగూడెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు వర్షానికి వందలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలనంటింది. మాసూలు చేసిన ధాన్యం రాశులు తడిచి మొలక వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికందే తరుణంలో వేలాది ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. ముదినేపల్లి, కలిదిండి, కైకలూరు మండలాల్లో ఆదివారం జిల్లా వ్యసాయాధికారి హబీబ్ బాషా పర్యటించి ధాన్యం రాశులు పరిశీలించారు. బరకాలతో కప్పిఉంచిన ధాన్యం పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. కోరుకొల్లులో పంట పొలాల్లో ధాన్యపు రాశులను తరలించడం కష్టతరమైతే రాశులపై పరదాలు కప్పి ఉంచాలన్నారు. వరి కోతలు తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్నారు.


కలిదిండి మండలం కోరుకొల్లులో ధాన్యం పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దన్నారు. చింతలపూడి, మండలంలో 1224 రకం వరి పంట కోత దశకు రాలేదు. మాసూళ్లయిన చోట్ల పలు గ్రామాల్లో ధాన్యం రాశులపై బరకాలు కప్పి రైతులు కాపలా ఉంటున్నారు. పోలవరం మండలంలో గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట, ఎల్ఎన్‌డీ.పేట, కోండ్రుకోట గ్రామాలలో రైతులు పంట ఒబ్బిడి చేసుకునే పనిలో ఉన్నారు. కొంతమంది రైతులు అయిన కాడికి ధాన్యం విక్రయిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలంలో రైతులు నానా పాట్లు పడుతున్నారు. రెండు రోజుల నుంచి ధాన్యపు రాశుల పై ఉన్న బరకాలు తొలగించి ఆరబెట్టుకునే ప్రయత్నం చేశారు. మళ్లీ వర్షం కురవడంతో కొంత తడిచి పోయింది. ఆరిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుకుని రోడ్డుపక్కనే ఉంచి బరకాలు కప్పారు. మల్కాపురం, తదితర గ్రామాల్లో వరిపైరు నేలకొరిగింది. కొన్ని చోట్ల కోసిన వరి పనలు, కుప్పలపై ఉంది. చలి గాలులు, చినుకులతో రైతులు ధాన్యం తరలిం చడానికి పాట్లు పడ్డారు. పెదవేగి, మండలంలో 6 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా 1860 ఎకరాల్లో వరి మాసూలు చేశారు. 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, మిల్లులకు తరలించగా 600 మెట్రిక్ టన్నులు ధాన్యం రైతుల వద్ద ఉంది. కొంత పంట కుప్పలు, మరికొంత పంట పనలపై ఉంది. దుగ్గిరాల వద్ద జాతీయ రహదారి పక్కన బరకాలు కప్పిన ధాన్యం రాశులపై వర్షపు నీరు నిలిచింది. ధాన్యం తడవకుండా తల్లీ కొడుకులు రాశి పైనుంచి వర్షపు నీటిని తోడి కాపాడుకునే పనులు చేపట్టారు. కొయ్యలగూడెం మండలంలో ఆర్డీవో ఎంవీ.రమణ పొంగుటూరు, గవరవరం గ్రామాలలో పర్యటించారు. రైతులు, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆమె తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ చెల్లన్నదొర, వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


కొయ్యలగూడెం మండలంలో ఆర్డీవో పరిశీలన

### రహదారులపై 12,765 మెట్రిక్ టన్నుల ధాన్యం

జిల్లాలో 1,91,379 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టగా ఇప్పటివరకు 97,523 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. 31,423 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో రైతులు విక్రయించారు. 12,765 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రహదారులపై ఆరబోశారు. 3314 టన్నుల ధాన్యాన్ని ఓదెలపై నిల్వ చేశారు. 5086 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లటానికి సిద్ధంగా ఉంది. కుప్పలపై ఉన్న వరి నుంచి 10,687 మెట్రిక్ టన్నుల ధాన్యం మాసూలవుతుంది. 51,603 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల సొంత అవసరాలకు నిల్వ చేసుకున్నారు. ఇప్పటివరకు 1,51,742 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఇప్పటివరకు 45 శాతం చేలల్లో వరి కోతలు పూర్తయినట్లు జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. పంట చేతికందే సమయంలో ఈదురు గాలులు, వర్షాలు రైతులను కుంగదీశాయి. కంటిపై కునుకు లేకుండా కుప్పలు, రాశుల వద్ద కాపలా ఉన్నారు.


ఏలూరు రూరల్ మండలంలో సంచులకెత్తుతున్న ధాన్యం

### చిరు జల్లులు

ఏలూరు సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను తీరం దాటినా ఆ ప్రభావం ఉంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని చోట్ల చిన్న జడి పడినా పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కొనసాగడంతో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. ఒక ప్రాంతంలో వర్షం ఉంటే మరో ప్రాంతంలో లేదు. కొన్ని ప్రాంతాల్లో ఎండ కనిపించినా మధ్యాహ్నం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఏలూరు నగరంతో పాటు నూజివీడు, కైకలూరు, జంగారెడ్డిగూడెం, పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఉంగుటూరు, నిమడ్రు, బుట్టాయగూడెం. కొయ్యలగూడెం, చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, భీమడోలు, ద్వారకాతిరుమల, జీలుగుమిల్లి, పోలవరం, చాట్రాయి, ముదినేపల్లి, మండవల్లి తదితర ప్రాంతాలలో వర్షం పడింది. జిల్లాలో గడచిన 24 గంటల్లో అత్యధికంగా ఏలూరు రూరల్ మండలంలో 11.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. కైకలూరు, కలిదిండి మండలాల్లో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి హబీబ్ బాషా పర్యటించి రైతులలో అవగాహన కల్పించారు. జేసీ సూచనలతో రైతులు వరి కోతలను రెండు రోజుల పాటు వాయిదా వేసుకున్నారు. వివిధ మండలాల్లో రైతులు స్థానిక వ్యవసాయ అధికారులు వరి పంటను రక్షించుకోడానికి సూచ నలు ఇచ్చారు. ఫెంగల్ తుఫాను ప్రభావం మరో రెండు రోజులు ఉంటుందని చెబుతున్నారు. కోసిన వరి పంటను ఎక్కడకు తీసుకువెళ్లాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కల్లాలు, ఓదెలలో కుప్పలుగా వేసిన ధాన్యాన్ని రైతులు రక్షించుకుంటున్నారు. రహదారులపై ఆరబోసిన ధాన్యానికి బరకాలు కప్పినా కిందికి నీరు చేరి ధాన్యం తడిసి పోతోందని రైతులు చెబుతున్నారు. జాతీయ రహదారుల పక్కన ఆరబెట్టిన ధాన్యం ఈ తడుస్తోందని రైతులు చెబుతున్నారు.

### బోసిపోయిన బీచ్

మొగల్తూరు: తుఫాన్ తీరం దాటినా సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో ఆదివారం బీచ్‌లకు పర్యాటకులు రాకుండా అడ్డుకున్నారు. కార్తీక మాసం ఆఖరి ఆదివారం పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చే అవకాశం ఉండడంతో కేపీ. పాలెం, పేరుపాలెం బీచ్‌కు పర్యాటకులు రాకుండా పోలీసులు ఎక్కడికక్కడే వాహనాలు నిలిపివేశారు. దీంతో సందర్శకులు లేక బీచ్ బోసిపోయింది.

### జిల్లాలో 3.4 మి.మీ. వర్షపాతం

గడచిన 24 గంటల్లో జిల్లాలో సరాసరి వర్షపాతం 3.4 మిల్లీమీటర్లు నమోదైంది. ఏలూరు రూరల్ మండలంలో 11.2 మిల్లీమీటర్లు, ఉంగుటూరు 9.8, నిడమర్రు 9.2, కలిదిండి 8.6, ఏలూరు అర్బన్ 8.2, కైకలూరు 6.4, మండవల్లి 6.2, ముదినేపల్లి 5.6, దెందులూరు 5.4, పెదవేగి 4.8, భీమడోలులో 4, పెదపాడు 4, నూజివీడు 3.2, ఆగిరిపల్లిలో 3 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో 2 మిమీ కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.


ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు

## ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి

ఏలూరు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలన ఏఆర్టీ చికిత్సలపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్ రాజు మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనకు ప్రభుత్వ ఎన్నో చర్యలు తీసుకుంటుందని, బాధితులు వైద్యుల సలహా మేరకు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. డెర్మటాలజీ ప్రొఫెసర్ రఘువీర్‌త్యాగి, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్స్ జెబి ఫ్లోరెన్స్, జగదీశ్వరరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్ బాధితులకు సంఘీభావం

ఏలూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని జిల్లా వైద్యఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఐవి బాధిత పిల్లలు, ట్రాన్స్‌జెండర్లకు సంఘీభావంగా వారితో కలిసి అధికారులు అల్పాహారం తీసుకున్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులు ధైర్యంగా ఉండాలని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి కేసుల వ్యాప్తి తగ్గుముఖం పట్టిందన్నారు. స్కూలు విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన పోస్టర్ పెయింటింగ్ పోటీలో విజేతలకు నగదు బహుమతులను సీనియర్ సివిల్ జడ్జి అందజేశారు. అధికారులు బాలాజీ, హరినాథకుమార్, విజయలక్ష్మి, జాగర్లమూడి శివకృష్ణ, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిన వెంకన్న ఆలయంపై డ్రోన్ కలకలం

- యూట్యూబ్‌లో వైరల్
- ఇది పాత వీడియో : ఈవో మూర్తి

7

## న్యాయమూర్తుల సంఖ్య పెరగాలి

సుప్రీం కోర్టు మాజీ జస్టిస్ చలమేశ్వర్

### గుబ్బల మంగమ్మ ఆలయం కిటకిట



గిరిజనుల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో చిరుజల్లులు పడడంతో ఆలయ కమిటీవారు భక్తులను సాయంత్రం 3 గంటలు దాటిన తర్వాత బయటకు పంపించారు.
- బుట్టాయగూడెం

## తాగునీరు సురక్షితమేనా..?



- రక్షిత నీటి పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 7 ల్యాబ్‌లు
- 2 స్పెషలైజ్డ్ ల్యాబ్‌లు
- రక్షిత నీటి సరఫరాకు చర్యలు



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 9,896 వరకు నీటి వనరులు ఉన్నాయి. గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ద్వారానే మంచినీరు సరఫరా చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పరీక్షించి రక్షిత నీటిని సరఫరా చేయాల్సి ఉండగా పరీక్షలు జరగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రక్షిత నీరు కూడా కలుషితమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో వాటర్ కన్సల్టేషన్ ఏర్పాటుచేసి జిల్లా వ్యాప్తంగా నీటి వనరులు పరీక్షించడానికి చర్యలు చేపట్టింది. అయినప్పటికీ నీరు కలుషితమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో పలుచోట్ల వాటర్ ప్లాంట్లలో తాగు నీరు కొనుగోలు చేసుకుంటున్నారు. డెల్టా మండలాలు, కొల్లేరు ప్రాంతాల్లో కాలుష్యం ఎక్కువ. - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయి ల్యాబ్ ఏలూరులోనే ఉంది. సబ్ డివిజన్ల వారీగా 7 ప్రాంతాల్లో మంచినీటి పరీక్షలు నిర్వహించే ల్యాబొరేటరీలు ఉన్నాయి. నూజివీడు, జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడెం, తణుకు, పాలకొల్లు, కొవ్వూరు ప్రాంతాల్లో ఈ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయి. ఇవి గాక ఏలూరు కలెక్టరేట్ కాంపౌండ్, పాలకొల్లు సమీపంలోని లంకలకోడేరులో స్పెషలైజ్డ్ ల్యాబొరేటరీలు ఉన్నాయి. ఈ స్పెషలైజ్డ్ ల్యాబొరేటరీలు రాష్ట్ర స్థాయిలో నాలుగు ఉండగా ఇందులో రెండు ల్యాబొరేటరీలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉండడం విశేషం. ప్రతి ఏడాది నీటి వనరుల రసాయన పరీక్షలు ఒకసారి, బాక్టీరియోలాజికల్ పరీక్షలు రెండు సార్లు నిర్వహిస్తారు. బాక్టీరియోలాజికల్ పరీక్షలు వర్షాకాలం ముందు, తర్వాత నిర్వహిస్తారు.

### నీటి పరీక్షలు ఇలా..

జిల్లాలో మంచినీటి వనరులకు 13 రకాల పేరామీటర్లుతో పరీక్షలు నిర్వహిస్తారు. ప్రధానంగా నీటి సాంద్రత, ఆమ్లత్వం, కఠినత్వం, క్షారత్వం, కాల్షియం, మెగ్నీషియం, ఫ్లోరైడ్, నైట్రేట్, సల్ఫేట్, ఐరన్ పరీక్షలతో పాటు బాక్టీరియోలాజికల్ పరీక్షలలో భాగంగా ఈకోలిఅండ్ కోలిఫాం పరీక్షలు కూడా నిర్వహిస్తారు. ఇవి సాధారణ ల్యాబొరేటరీలో నిర్వహించే పరీక్షలు కాగా స్పెషలైజ్డ్ ల్యాబొరేటరీలలో మెటల్స్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. నీటిలో ఎంతవరకు హెవీ మెటల్స్ ఉన్నాయో లేదో తెలుసుకుంటారు. మంచినీటిలో పురుగు మందు అవశేషాలు కూడా పరీక్షిస్తారు. చేపల చెరువుల పక్కన నీటి వనరుల్లో కాలుష్యం ఎక్కువ. ఇప్పటివరకు జిల్లాలో నిర్వహించిన మంచినీటి పరీక్షల్లో పురుగుమందుల అవశేషాలు ఎక్కడా కనబడలేదని చెబుతున్నారు.

### రక్షిత నీటి పథకాల వద్ద..

గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తారు. జరుగుతుంది. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి పథకంతోపాటు మూడు డెలివరీ పాయింట్ల వద్ద పరీక్షలు నిర్వహిస్తారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, ఏదైనా ఇంటివద్ద సరఫరా అవుతున్న మంచినీటిని పరీక్షిస్తారు. ఇదికాకుండా రక్షిత మంచినీటి పథకాల వద్ద నీరు వదిలే సమయంలో రెసుడ్యువల్ క్లోరిన్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. ఆ పరీక్ష నిర్వహించిన అనంతరమే ప్రజలకు నీటి సరఫరా చేయటం జరుగుతుంది. జిల్లాలోని సీపీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ పథకాల వద్ద కూడా పరీక్షలు నిర్వహిస్తారు.

### కైకలూరు సబ్ డివిజన్‌లో టీడీఎస్

కైకలూరు డివిజన్‌లో మంచినీటిలో టీడీఎస్ వాల్యూ పెరుగుతోందని నీటి పరీక్షలతో తెలుస్తోంది. జిల్లాలో హెవీమెటల్స్, పురుగుమందు అవశేషాలు కనిపించలేదని ఆర్‌డబ్ల్యుఎస్ వాటర్ జిల్లా కన్సల్టెంట్ చెబుతున్నారు.

### ప్లాంట్ వాటర్ వినియోగం

గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ద్వారా నీరు సరఫరా అవుతున్నా జిల్లాలో వాటర్ ప్లాంట్లలో నీటి వినియోగం బాగా పెరిగింది. ప్రతి గ్రామంలో ప్లాంట్ వాటర్ ఎక్కువ వినియోగిస్తున్నారు. ఇళ్లల్లో ప్యూరిఫైడ్ ట్యాంకులు ఏర్పాటుచేసి నీటిని వినియోగిస్తున్నారు.

## ఫలితాలు దారుణం



- ఇంటర్ ఉత్తీర్ణత మైనస్
- త్రైమాసిక పరీక్షల్లో అదే తీరు
- ప్రత్యేక కార్యాచరణకు సమాయత్తమైన విద్యాశాఖ

### హైస్కూల్ ప్లస్ ఉత్తీర్ణతపై అధికారుల సమీక్ష

ఏలూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంపికచేసిన జడ్పీ హైస్కూళ్ల ప్రాంగణంలో హైస్కూల్ ప్లస్ పేరిట రెండేళ్ల ఇంటర్మీడియట్ విద్యనందిస్తున్నారు. మూడేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించిన ప్లస్ టూ విద్య క్షేత్రస్థాయిలో దారుణంగా విఫలమైంది. హెచ్ఈసీ, సీఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో జిల్లాలో మొత్తం 30 హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటుచేయగా నాలుగింటిలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. ఒకటి రెండు మినహా మిగతా వాటిలో 20 నుంచి 35 మందిలోపే ఉండడం గమనార్హం. తొలిబ్యాచ్ ఉత్తీర్ణత అత్యంత స్వల్పంగా నమోదైంది. మండలానికో జడ్పీ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్టు బిల్డప్ ఇచ్చినా మొదటి రెండేళ్ల ఫలితాలు అతి స్వల్పం. 2022లో ప్రారంభమైన హైస్కూల్ ప్లస్ నుంచి తొలి బ్యాచ్ 2023 పరీక్షల్లో జిల్లాలో 181మంది విద్యార్థులు హాజరుకాగా కేవలం 17మంది (9.39శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 323 మంది విద్యార్థులు హాజరుకాగా, కేవలం 103 మంది (31.89శాతం) ఉత్తీర్ణత నమోదైంది. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో 30 హైస్కూల్ ప్లస్‌లలో మొత్తం 708 మంది విద్యార్థులు చదువుతుండగా 503మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఇటీవల త్రైమాసిక పరీక్షలకు హాజరుకాగా 123 మంది ఫెయిల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 205 మంది హాజరుకాగా 30మంది ఫెయిల్‌కావడంతో కొద్దిరోజులక్రితం ఈ పరీక్షల ఫలితాలపై సమీక్ష జరిగింది. సబ్జెక్టు బోధించే పీజీటీలను (స్కూల్ అసిస్టెంట్లు) నియమించినా ఆశించిన ఫలితాలు రాకపోవడంపై కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారులను ప్రశ్నించారు. హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించడానికి చేసిన హడావుడి సైన్స్ విద్యార్థులకు అవసరమైన ల్యాబ్‌లు, లైబ్రరీల ఏర్పాటు చేయలేదు. విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రయోగశాలలను వినియోగించుకుంటున్నట్టు సమాచారం. పాఠ్య పుస్తకాలు సకాలంలో ఇవ్వకపోవడం కూడా ఫలితాల వెనుకబాటుకు మరో కారణంగా చెబుతున్నారు.

### ప్రత్యేక కార్యాచరణ

త్రైమాసిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను జిల్లావిద్యాశాఖ సిద్ధం చేసింది. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని పీజీటీలను ఆదేశించింది. చదువులో వెనుకబడిన, స్లో లెర్నర్ల కోసం గ్రూపులుగా విభజించి ప్రత్యేక బోధన చేయాలని సూచించింది. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులను తరచూ కలుసుకుంటూ ఇంటి వద్ద హోంవర్క్, రోజువారీగా కళాశాలలో ఇచ్చే పాఠ్యాంశాలను మరోసారి అభ్యసించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. సంబంధిత విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇవ్వడం, ప్రాక్టీస్ టెస్ట్‌లు చేయించడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. త్రైమాసిక పరీక్షల్లో 70శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత వచ్చిన హైస్కూల్ ప్లస్‌లలో మంచి ఉత్తీర్ణత సాధించేదిశగా కార్యాచరణ అమలుచేయనున్నారు.

### మూసివేత ప్రయత్నాలు వద్దు

కనీస అడ్మిషన్లువున్న హైస్కూల్ ప్లస్ (జడ్పీ జూనియర్ కళాశాల)ను కొనసాగించాలని ఆదివారం ఏలూరులో జరిగిన డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లాశాఖ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.శ్రీను, పి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అర్హతలగల స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా పదోన్నతి పొందే ఏకైక అవకాశాలను మూసివేయవద్దని, రానున్న రోజుల్లో హైస్కూల్ ప్లస్‌లలో అడ్మిషన్లు పెరిగేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద, బలహీనవర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలకు హైస్కూల్ ప్లస్‌లు ఉపయోగపడుతున్నాయన్నారు. గ్రంథాలయం, ప్రయోగశాలలు వంటి సదుపాయాలను కల్పించాలని, ఉద్యోగ నియామకాలను చేపట్టాలని అభ్యర్థించారు. సంఘ నాయకులు ఎం.అచ్యుతరావు, టి.శ్రీను, ఎన్.అజాద్. కె.శ్రీను, ఆర్.వెంకట్, ఎన్.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


శ్రీను, డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

# నాన్నే నాకు స్ఫూర్తి

## సేవ చేయాలన్న లక్ష్యంతోనే పోలీస్ శాఖలోకి

## స్మార్ట్ వర్క్‌తో చదివితే విజయం తథ్యం

## నరసాపురం డీఎస్పీ శ్రీవేద


డీఎస్పీ శ్రీవేద.. భర్త, కుమార్తెతో

నరసాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాన్న సూర్యప్రకాశరావు రిటైర్డ్ ఐజీ.. పోలీస్ శాఖలో నిజాయితీగా పనిచేసి ఎన్నో కేసుల్ని ఛేధించారు..చిన్నతనం నుంచి నాన్నను చూస్తూ పెరిగా.. పోలీస్ అవ్వాలని కలలు కన్నా.. దానికి తగ్గట్టుగానే చదువుల్లో రాణించి డాక్టరయ్యాను.. డాక్టర్‌గా ప్రజలకు సేవ చేస్తున్నా..నా టార్గెట్ వదల్లేదు. మూడేళ్లు కష్టపడి చదివా. మొదటి ప్రయత్నంతోనే గ్రూప్-1 ఎంపికై పోలీస్‌శాఖలో చేరాను. నా ఆశయాన్ని నేర వేర్చుకున్నా.. నాకు స్ఫూర్తి.. మా నాన్నే.. అని నేటి విద్యార్థులు అను కున్నది సాధించాలంటే పట్టుదలతో పాటు ప్లానింగ్ కూడా అవసరం.. ఎన్నిగంటలు చదివాం.. అన్నది ముఖ్యం కాదు...మంచి పుస్తకాలను అవసరమైతే ఒకటి రెండు సార్లు చదివాలి. ర్యాంకు సాధించాలంటే స్మార్ట్‌వర్క్ చాలా ముఖ్యమని చెబుతున్నారు నరసాపురం డీఎస్పీ శ్రీవేద.. ఆమె విజయం వెనుక ఆమె పడ్డ కష్టం ఆమె మాటల్లోనే..

మాది శ్రీకాకుళం జిల్లా...మా నాన్న సూర్యప్రకాశరావు 1987లో డీఎస్పీగా పోలీస్‌శాఖలో చేరారు. ఉమ్మడి ఆంధ్రలో పలు జిల్లాల్లో పని చేయడం వల్ల నా విద్య చాలాచోట్ల సాగింది. మేము ముగ్గురు అక్కచెల్లెళ్లం. నేనే చివర.. పదో తరగతి హైద్రాబాద్‌లోని సెంట్ ఆన్స్‌లో చదివా. ఇంటర్‌లో కూడా టాపర్‌నే. డాక్టర్ చదవాలని బైపీసీ చదివా. అయితే బీడీఎస్ వచ్చింది. నల్గొండ జిల్లా నార్కేట్‌పల్లిలో పూర్తి చేశా. యూనివర్సిటీ గోల్డ్ మెడల్. ఎండీఎస్ హైద్రాబాద్‌లో పూర్తి చేశా..అక్కడ కూడా టాపర్‌నే.

ప్రజలకు సేవ చేయాలని ప్రభుత్వశాఖలో చేరా.. శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తూ గ్రూప్ 1కు ప్రిపేర్ అయ్యాను. మూడేళ్లు కష్టపడి చదివాను. కోచింగ్ తీసుకోలేదు. నోట్స్ ప్రిపేర్ బాగా కలిసొచ్చింది, ఆన్‌లైన్ బాగా ఉపయోగపడింది. ఆన్‌లైన్ పరీక్షలు కూడా రాశాను. ఇంటర్వ్యూకు మాత్రం హైద్రాబాద్‌లో కోచింగ్ తీసుకున్నా. 2022లో ఎంపికయ్యాను. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించడం చాలా ఆనందం అనిపించింది. దీనికి నా భర్త, అత్తమామల ప్రోత్సాహం ఎంతో ఉంది.

భర్త హైకోర్టు న్యాయవాది..ఒక పాప, ఫస్ట్‌క్లాస్ చదువుతోంది. మా అత్తగారి కుటుంబం న్యాయ శాఖకు సంబంధించిదే. మామగారు జిల్లా జడ్జిగా పని చేశారు. శిక్షణలో కూడా నాకు మంచి అవార్డులు దక్కాయి. ట్రైనింగ్ బ్యాచ్‌ను నేనే లీడ్ చేసేదాన్ని. గ్రేహౌండ్స్ ట్రైనింగ్ మూడు నెలలు ఇచ్చారు. ప్రసంశాపత్రం కూడా దక్కింది.

### స్టేషన్ వచ్చేవాళ్లకి న్యాయం జరగాలి

సమస్య వచ్చినప్పుడు న్యాయం జరుగు తుందని పోలీస్‌స్టేషన్‌కు వస్తారు. వారి నమ్మకానికి అను గుణంగా పని చేయాలన్నదే నా ఉద్దేశం. స్టేషన్లకు వచ్చే వారందరికీ న్యాయం జరిగేలా చూస్తా. ముఖ్యంగా మహి ళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, ఈవ్‌టీజింగ్, చిన్న పిల్లలపై లైంగిక వేదింపుల్ని అరికట్టాలన్నదే నా లక్ష్యం. నేను బాధ్యతలు చేపట్టగా వచ్చిన మొదటి కేసు పోక్సో కేసు. మొగల్తూరు స్టేషన్‌లో నమోదైన ఈ కేసును రెండు రోజుల్లో ఛేధించాం.

# పరిహారం దక్కేనా ?

## పంట నష్టపరిహారం కోసం రైతుల ఎదురు చూపు..

## ఎర్రకాల్వ వరదలకు పంట కోల్పోయిన రైతుల ఆందోళన


ఎర్రకాల్వ వరదకు నందమూరులో మునిగిన చేలు(ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రకాలువ రైతులు పంట నష్ట పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం, నల్లజర్ల మండలం, నిడదవోలు మండలాలకు చెందిన సుమారు 15 వేల ఎకరాల్లో ఎర్రకాలువ వరదలకు గత జూలై నెలలో పంట నష్టం వాటిల్లింది. అయితే ఈ పంట నష్ట పరిహారం ఇవ్వకుండా ఆగస్టు పరిహారం నెల క్రితమే ప్రభుత్వం విడుదల చేయడంతో ఎర్రకాలువ వరదల కారణంగా నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు. పంట నష్టపోయి మళ్లీ పంట వేసిన తరువాత కూడా ఏక్షణాన వరదలు వస్తాయని రైతులు భయపడుతూనే సాగుచేశారు. అయితే ప్రభుత్వం తమకంటే వెనకాల నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించడంపై తమకు పరిహారం అందుతుందో లేదో అని ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం ఎర్రకాలువ వరదలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

ఎర్రకాలువ వరదలకు తాడేపల్లిగూడెం మండలంలోనే ఏకంగా 6 వేల ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారు. మండలంలోని నందమూరు., మారంపల్లి, ఆరుళ్ల, జగన్నాధ పురం, మాధవరం, అప్పారావుపేట, పట్టిం పాలెం, వీరంపాలెం, కొమ్ముగూడెం గ్రామాల్లో 6 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు నివేదికలు పంపించారు. అంటే ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు చొప్పున రూ.6 కోట్ల పంటనష్ట పరిహారం అందించాల్సి ఉంది. త్వరగా ఈ పంట నష్ట పరిహారం అందిస్తే రైతులకు ఊతం ఇచ్చినట్టు ఉంటుందని రైతులు కోరుతున్నారు.

### ఇప్పటికే ఆలస్యం అయింది..



జూలై నెలలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి.ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. ఇకనైనా పరిహారం అందిస్తే రైతులకు మేలు చేసినట్టు ఉంటుంది. కూటమి ప్రభుత్వంపై రైతులకు ఎంతో నమ్మకం ఉంది త్వరగా పరిహారం చెల్లించాలి.

-పరిమి వీరభద్రరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు

### ఎకరాకు రూ.16 వేలు ఇవ్వాలి



మాకు పరిహారం పదివేల లోపు ఇస్తారని అధికారులు చెబుతున్నారు. కానీ విజయవాడ ప్రాంత రైతులకు ప్రత్యేక పరిహారం ఇచ్చినట్టు మాకు కూడా ఎకరాకు రూ.16 వేలు చెల్లిస్తే బాగుంటుంది.

-ముళ్లపూడి రామకృష్ణ, రైతు

# చిన వెంకన్న ఆలయంపై డ్రోన్ కలకలం

## యూట్యూబ్‌లో వైరలైన వైనం

## ఇది పాత వీడియో : ఈవో మూర్తి


విచారణ చేస్తున్న తహసీల్దారు సుబ్బారావు

ద్వారకాతిరుమల, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): శ్రీవారి ఆలయంపై డ్రోన్ ఎగిరిందన్న వార్త ఆదివారం దుమారాన్ని రేపింది. శేషాచలంపై ఓ యూట్యూబర్ డ్రోన్‌ను ఎగురవేసి ఆ విజువల్స్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. డ్రోన్ ఎగుర వేసిన యూట్యూ బర్ పైనా...పట్టించుకోని భద్రతా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అయితే దీనిపై ఆలయ ఈఓ మూర్తి వివరణ ఇస్తూ అన్ని రకాలుగా విచారణ చేశామని ఇది ఎప్పుడో పాత వీడియో అని.. ఇటీవల తీసింది కాదని గుర్తించామన్నారు. అది డ్రోన్ వీడియో కాదని.. లాంగ్ షాట్ వీడియో అని వివరణ ఇచ్చారు. అయితే ఈ ఘటనపై కలెక్టర్ విచారణ జరపాలని ఆదేశాలివ్వడంతో తహసీల్దారు సుబ్బారావు అన్ని కోణాల్లో దీన్ని పరిశీలించి నివేదిక పంపారు. యూట్యూబ్‌లో ఈ వీడియోలు తొలగించినట్టు తెలిసింది.



# తణుకులో చిన్నారుల రికార్డు నృత్య ప్రదర్శన

తణుకు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 185 మంది కూచి పూడి చిన్నారులు రింగ్ డ్యాన్స్ విత్ ఫైర్ ప్రద ర్శనకు తణుకు పట్టణం వేదికైంది. ఆదివారం ఏఎస్ఆర్ కళాశాల ప్రాంగణలో శ్రీ పద్మజా నృత్య కళాక్షేత్రం చిన్నారులు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్-జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో వరల్డ్ రికార్డ్ నమోదు చేశారు. కార్యక్రమానికి తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ, ఏఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ ఆకుల విజయవర్ధన్ విచ్చేసి చిన్నా రులను అభినందించి మెమొంటోలు అందిం చారు. కాగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఫోన్ చేసి చిన్నారులను అభినం దించారు. వేదికపై కూచిపూడి గురువు చింతా రవిబాల కృష్ణ చేసిన మోహిని భస్మాసుర నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



# జిల్లాస్థాయి భగవద్గీత పోటీల విజేతలకు బహుమతి

భీమవరంటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో నిర్వహించారు.జిల్లాలోని అనేక పాఠశాలలో పోటీలు నిర్వహించి అందులో మొదటి బహుమతి పొందిన సుమారు 100 మంది బాల,బాలికలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదాన సభకు ఆనంద గ్రూప్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వ నాథరాజు, కేజీఆర్ఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రాజీ బహుమలందజేశారు. చిన్మయ మిషన్ అధ్యక్షుడు మడిపల్లి శేఖర్ స్వాగతం పలికి నారు. ముఖ్య అతిథి విశ్వనాథరాజు మాట్లాడుతూ గీత పఠనం వల్ల విద్యార్థులలో మానసిక శక్తి పెరిగి ఉన్నత ఆలోచనలు కార్యశీలత పెరుగుతుందన్నారు. ఈ పోటీలకు గోపాల శర్మ, శారద, తమ్మన రామలక్ష్మి, మౌళి లత, బొండాడ ఇందిరా, పెరుమాల ప్రతిమ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఆరు గ్రూపులలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన18 మంది బాల బాలికలకు నగదు బహుమతి అందజేశారు.




సంతాప సభలో మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ.. పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, రఘురామకృష్ణరాజు

# సూర్యనారాయణరాజు పేరిట ట్రస్టు ఏర్పాటు

## తండ్రి సంస్మరణ సభలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి భూపతిరాజు సూర్యనారాయణ రాజు పేరిట ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రకటిం చారు. ఆయన తండ్రి సూర్యనారాయణరాజు సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి తండ్రి ప్రో త్సాహంతో ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. తన పరిధిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రోజు సమయం కేటాయించి పని చేస్తానని కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పథంలో తీసుకువెళతానన్నారు. సంస్మరణ సభలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, మంత్రి నిమ్మల రామానా యుడు, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనే యులు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, సోము వీర్రాజు, మాధవ్, జీవీఎల్ నరసింహ రావు, మంతెన రామరాజు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో ఉమా మహేశ్వరరావు నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న జక్కంపూడి రాం ప్రసాద్..ఉండి వైద్యుడు సాయిచంద్ర, ఎల్‌టీ శ్రీదేవి

# వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు

పాలకొల్లు/ ఉండి, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): పాలకొల్లు పట్టణానికి చెందిన డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జక్కంపూడి కుమార్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖా ధికారి డాక్టర్ ఉమా మహేశ్వరరావు, అడిషినల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భానునాయక్‌ల నుంచి అవార్డు, ప్రశాంసాపత్రం అందుకున్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు, పౌష్టికాహారం పంపిణీ వంటి సేవా కార్యక్ర మాలు చేసిన రాంప్రసాద్‌కు అవార్డు లభిం చడంపై పలువురు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, డాక్టర్లు అభినందించారు. హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాలు చేపట్టినందుకు ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా.సాయి చంద్ర, ఎల్‌టిగా పనిచేస్తున్న శ్రీదేవి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

## మెడికల్ సూపరింటెండెంట్ రాజు

## ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

ఏలూరు క్రైం, డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించే విధంగా అధికారుల సహకారంతో కృషి చేస్తున్నామని ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆది వారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సమస్యల తిష్ట అనే శీర్షికలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరతతో వచ్చే రోగులకు వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయని కథనానికి ఆయన స్పందించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగ వైద్యులు తప్ప మిగతా వైద్యులు అంతా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆధీనంలో ఉంటారని ఆ పోస్టుల భర్తీపై వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా డైరె క్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వారికి విన్న వించామన్నారు. ఆసుపత్రి వైద్య సేవలపై జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ప్రజా ప్రతినిధులు, డీఎం హెచ్‌వో, డీసీహెచ్ అధికారుల సహకారంతో సిబ్బంది ఉత్తమ సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నామని రాజు తెలిపారు.

# గరికి ముక్కు సుబ్బయ్యకు ఢిల్లీ ఆహ్వానం



భీమవరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : బాబాసాహెబ్ బి.ఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతి పురస్క రించుకొని భారత పార్లమెంట్లో ఈనెల 6వ తేదీన 69వ మహా పరినిర్వాన్ దివస్ కార్య క్రమాన్ని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ, అంబేడ్కర్ ఫౌండేషన్ నిర్వహి స్తున్నది. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్యకు అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్మన్ వీరేంద్ర కుమార్ నుంచి ప్రత్యేక ఆహ్వానం అందినట్లు సుబ్బయ్య తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్‌తో పాటు ఇతర మంత్రిత్వ శాఖల మంత్రులు హాజరు కానున్నారు. మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ , కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీని వాస్‌లు సుబ్బయ్యను అభినందించారు


చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు



# న్యాయమూర్తుల సంఖ్య పెరగాలి

## సుప్రీం కోర్టు మాజీ జస్టిస్ చలమేశ్వర్

నరసాపురం , డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సత్వర న్యాయం జరగాలంటే పెరుగు తున్న జనాభాకు అనుగుణంగా న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల సంఖ్య పెరగాలని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఆదివారం తెలగా కల్యాణ మండ పంలో నరసాపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దివంగత న్యాయవాది కొమాండూరి శ్రీనివాస్ చిత్రపట ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. న్యాయవ్యవస్థలో పరిస్థితులకు అనుగుణంగా సమర్థతను పెంపొందించాలన్నారు. ఇటీవల కాలంలో సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం పెరగడం వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నా యన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా న్యాయవాదులు వృత్తి నైపుణ్యాలు పెంచు కోవాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయ వాదులు సీనియర్లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదులు ఓపిక ఉన్నంత వరకు న్యాయస్థానాలకు రావాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ , ఏపీ బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులు చిదంబరం, జిల్లా అదనపు న్యాయమూర్తి విజయదుర్గా, న్యాయమూర్తులు గంగరాజు, వరలక్ష్మి, శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజీ, జీవికె రామారావు, కానూరి బాబ్జీ, కొత్తపల్లి రమేష్, పూరేళ్ళ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

# క్షీరారామ, మావుళ్లమ్మ ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తి పూజలు


మావుళ్ళమ్మను దర్శించుకున్న జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులు

పాలకొల్లు అర్బన్/ భీమవరంటౌన్, డిసెం బరు 1 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం శ్రీక్షీరా రామ లింగేశ్వరస్వామి, భీమవరం మావుళ్లమ్మ ఆలయాలను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు దంపతులు ఆదివారం దర్శిం చుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల పూజలు అనంతరం న్యాయ మూర్తి దంపతులకు పండితులు వేదాశీర్వాదం అనం తరం స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు అందించారు. అందిం చారు. మావుళ్ళమ్మ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు చేసి వేద ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్ర పటాన్ని దేవస్థానం సహాయ కమిషనర్ బుద్ధా మహాలక్ష్మి నగేష్ అందించారు.

# ముంబయి ఎయిర్ బస్ ప్రారంభించిన మంత్రి దుర్గేష్



రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : కేవలం రెండు గంటల్లోనే రాజ మహేం ద్రవరం నుంచి ముంబయికి వెళ్లవచ్చని రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మధురపూడి విమానాశ్రయం నుంచి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు తొలిసారిగా ముం బయికి నేరుగా విమాన సర్వీసును ప్రారంభించి మాట్లాడారు. ఎయిర్ బస్సు సర్వీసుతో రాజమ హేంద్రవరం -ముంబయికి మధ్య దూరం తగ్గిందన్నారు. ఈ నెల 12 నుంచి న్యూఢిల్లీకి ఇక్కడ నుంచి విమాన సర్వీసు ఆరంభ మవు తుందన్నారు. కేంద్రమంత్రి రామ్మోహనాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పట్టుదలతో ఎయిర్‌బస్ సర్వీసు వేశారన్నారు. ఎయిర్ పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 4.50 గంటలకు ముంబయి నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు 6.45 గంటలకు చేరుతుందన్నారు. ఈ ఎయిర్‌బస్సు రాత్రి 7.15 గంటలకు ఇక్కడ నుంచి తిరిగి బయలుదేరి రాత్రి 9.05 గంటలకు ముంబయి చేరుకుంటుందని చెప్పారు. ఎమ్మె ల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వర రావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నేతలు నీరుకొండ వీరన్నచౌదరి, జవ్వాది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు 13 మంది ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదా వరి జిల్లాల్లో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్షల్లో 13 మంది అభ్యర్థులు అర్హత సాధించారని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కెఎన్.జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. సివిల్ సర్వీస్ ఉచిత కోచింగ్‌కు నిర్వహిం చిన ప్రవేశ పరీక్షకు 70 మంది హాజరు కాగా 13 మంది అర్హత సాధించారన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో ఆరు నెలల పాటు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ అందిస్తారన్నారు. కోచిం గ్‌కు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్రైమ్ కార్నర్

# యువతి అనుమానాస్పద మృతి


ప్రియాంక(ఫైల్)

ఏలూరు క్రైం, డిసెం బరు 1 (ఆంధ్ర జ్యోతి) : ఒక యువతి ఉరి వేసు కుని మృతి చెందినట్టు సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ సీఐ వైవి రమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన తెల్లం శ్రీకాంత్ (30) ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మత్తు శస్త్రచికిత్స విభాగంలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అతను గవర్నమెంట్ ఆసుపత్రిలో పనిచేసే నర్సును వివాహం చేసుకున్నాడు. ఏలూరులోని వంగాయి గూడేనికి చెందిన కాలి ప్రియాంక (25) పదోతరగతి వరకు చదివి బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుని హైదరాబాద్‌లో పనిచేస్తున్నది. ఆమె తండ్రి అనారోగ్యంతో ఉండ డంతో ఏడాదిన్నర క్రితం ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో చేర్పించింది. ఆ సమయంలో శ్రీకాంత్ పరిచయం అయ్యాడు. తనకు వివాహం కాలేదని పెళ్ళి చేసుకుంటానని నమ్మబలికి ప్రియాంకను పెళ్ళి చేసుకున్నాడు. ఈ విషయం ఆ అమ్మాయి తల్లిదండ్రులకు తెలియడంతో బాగానే చూసు కుంటానని నమ్మ బలికాడు. ఏలూరు కట్టా సుబ్బారావు వీధిలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ప్రియాం కను అక్కడ ఉంచాడు. కొద్ది రోజుల నుంచి గొడవలు జరుగు తున్నాయని, తన దగ్గర నుంచి డబ్బులు తీసు కుంటున్నాడని అతనికి పెళ్ళి కూడా జరిగిందని ప్రియాంక తన తల్లి దండ్రు లకు చెప్పింది. దీంతో ఆమె తల్లిదండ్రులు శ్రీకాంత్‌ను నిల దీశారు. జాగ్రత్తగా చూసుకుం టానని నమ్మ బలికాడు. శనివారం రాత్రి కూడా వారిద్దరి మధ్య గొడవలు జరిగినట్లుగా చెబు తున్నారు. ఆదివారం ఉదయాన్నే శ్రీకాంత్ ప్రియాంక తల్లి దండ్రులకు ఫోన్ చేసి ఆమె ఉరి వేసుకుని మరణించిందని చెప్పడంతో ఆమె తల్లిదండ్రులు అక్కడకు చేరుకున్నారు. ఈ సమాచారం ఏలూరు టూటౌన్ పోలీసులకు అందించడంతో సీఐ రమణ సంఘ టనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం ఏలూరు ప్రభుత్వాసు పత్రికి తరలించారు.

## వివాహిత అదృశ్యం

ఏలూరు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒక వివాహిత ఇంటి నుంచి వెళ్ళిపోయిందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏలూరు వన్ టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. ఏలూరు తమ్మిలేరు ఏటిగట్టు గొల్లాయిగూడెం ప్రాంతానికి చెందిన దేవరపల్లి రవికుమార్‌కు భార్య ధనలక్ష్మి (20), ఒక కుమార్తె ఉన్నారు. సెప్టెంబర్ 12వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఆమె ఇంటి నుంచి వెళ్ళి పోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కాన రాలేదు. దీంతో ఆమె భర్త ఫిర్యాదు చేయడంతో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వ ర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుని ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతూ

ఏలూరు క్రైం, డిసెం బరు 1 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక యువ కుడు శనివారం రాత్రి ఏలూరు పడమర లాకుల సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్దకు వచ్చి పైనుంచి దూకేశాడు. దీంతో అతను తీవ్ర గాయాలకు గురయ్యాడు. పెదపాడు మండలం కొత్తూరుకు చెందిన పాలపర్తి సురేష్ (30) శనివారం రాత్రి తన కుటుంబ సభ్యులతో గొడవపడి ఆత్మహత్య చేసుకోవడానికి ఏలూరు పడమర లాకుల సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్దకు వచ్చి పై నుంచి దూకేశాడు. గాయాలతో ఉన్న అతను కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు ఆ కేకలు విని అగ్నిమాపక సిబ్బందికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫైర్ డిపార్ట్‌మెంట్ రెస్క్యూ టీమ్ వచ్చి అతనిని బయటకు తీసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తర లించారు. కుటుంబ సభ్యుల మధ్య పొలాల గొడ వలు నేపథ్యంలో అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నట్లు ప్రాథమికంగా గుర్తించారు.

# వివాహిత అనుమానాస్పద మృతి

ముసునూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన ముసునూరు మండలం గుడిపాడులో ఆదివారం చోటు చేసుకుంది. నూజివీడు పట్టణా నికి చెందిన నల్లపు మేరి (35)కి, గుడిపాడుకు చెందిన పెనుమాల గిరికి 20 ఏళ్ళ క్రితం వివాహ మైంది. అయితే గిరి వివాహేతర సంబంధం పెట్టుకుని, మద్యం సేవిస్తూ, భార్య మేరిని రెండేళ్లుగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. పెద్దల సమక్షంలో మూడుసార్లు పంచాయతీ పెట్టి గిరిని హెచ్చరించినా అతని తీరు మార లేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తన భార్య చనిపోయిందని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నూజివీడు సీఐ రామకృష్ణ, ముసు నూరు ఎస్ఐ ఎం.చిరంజీవి, నూజివీడు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మేరీ మృతదేహాన్ని పరిశీలించి, చుట్టుపక్కల విచా రించారు. మేరీ హత్య చేయబడిందని, ఆమె మెడపై వైర్‌తో ఉరివేసినట్లు అనుమానంగా ఉందని కుటుంబసభ్యులు ఆరోపించారు. తన అక్కను గిరి ఉరివేసి చంపాడని మృతిరాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మేరీ మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. అయితే ఇంటిలో ఉన్న బియ్యపు డ్రమ్ములో వైర్ ఉన్నట్టు గుర్తించిన పోలీసులు గిరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

## రైతులను ఇబ్బంది పెట్టవద్దు



కొవ్వలిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

దెందులూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైసు మిల్లుల యజమానులు రైతులను ఇబ్బంది పెట్టవద్దని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అన్నారు. కొవ్వలిలోని వరి పంట పొలాలను ఆదివారం తహసీల్దార్ సుమతి, ఆర్ఐ హేమతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం కొవ్వలి పరిధిలో ఉన్న రైసు మిల్లులను పరిశీలించారు. తేమ అంటూ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## నిలిచిన మంచినీటి సరఫరా

పోలవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి సత్యసాయి మంచినీటి సరఫరా వారం రోజులుగా నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాతపోలవరం, ఏనుగులవీధి, మసీదువీధి, మెయన్ బజార్, ముప్పిరిశెట్టివారివీధి, బెస్తావీధి, కమ్మరగూడెం, నూతన గూడెం ప్రాంతాలలో సత్యసాయి మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో సుమారు 8 వేల కుటుంబాలు మంచినీటకి కటకటలాడుతున్నాయి. గోదావరి రేవుల నుంచి, ప్రైవేటు వాటర్ ప్లాంట్లు నుంచి మంచినీటిని తెచ్చుకుంటున్నారు. పలు చోట్ల సత్యసాయి మంచినీటి పథకం పైపు లైన్లు లీకై మరమ్మతులకు గురి కావడంతో నీటి సరఫరా నిలించిందని అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

చింతలపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గ్రామాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జి.రవి ప్రకాష్ అన్నారు. భట్టువారిగూడెంలో జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే దళిత గ్రామాల్లో సరైన రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సదుపాయాలు లేవని, వీటిపై ప్రభుత్వం దృష్టి పెట్టి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, దీనివలన బడుగు, బలహీన వర్గాల జీవన పరిస్థితులు మెరుగుపడతాయని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళితసేన స్థానిక నాయకులు కార్తీక్, స్టాలిన్, నాగేందర్, భానుప్రసాద్, నాగపాం రాజేష్, పలువురు పాల్గొని మాట్లాడారు.

## ఇంటింటా ప్రచారం



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించే సత్తా కలిగిన ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గంధం నారాయణరావుకు ఉందని ఏపీటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసడాంగే, జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ బృందం ఆదివారం పలువురు ఉపాధ్యాయులను, అధ్యాపకులను కలుసుకుని కరపత్రాలు అందచేసి అనంతరం నారాయణరావును గెలిపిస్తే జరిగే ప్రయోజనాలను వివరించారు. నారాయణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఏపీటీయూసీ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## గ్యాస్ రెగ్యులేటర్ కూడా ఆపాలి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇంట్లో వంట పూర్తవ్వగానే గ్యాస్‌స్టౌవ్ ఆఫ్ చేయడమే కాకుండా రెగ్యులేటర్ కూడా ఆఫ్ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ గాయిత్రీ అన్నారు. మన వంట-మన బాధ్యత కార్యక్రమం ఆదివారం కలెక్టరేట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా గాయిత్రీ మాట్లాడుతూ వంటచేసే సమయంలో మహిళలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి విజేతలకు గ్యాస్ స్టౌవ్‌లు ఇచ్చారు.

## కృత్రిమ రంగులు కలపడంలేదు

ఏలూరు క్రైం, డిశంబరు 01 (ఆంధ్రజ్యోతి) : తమ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల్లో ఎలాంటి రంగులు కలపడం లేదని నాణ్యత, ఆహార పరిరక్షణ నిబంధనల ప్రకారమే తాము వంటకాలు తయారు చేస్తున్నామని ప్యారడైజ్ ఫుడ్‌కోర్టు ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో గౌతమ్‌గుప్తా ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 29న ఏలూరులోని ప్యారడైజ్ రెస్టారెంట్‌పై విజిలెన్సు అధికారులు దాడి చేసి, కృత్రిమ రంగులు ఆహార పదార్థాల్లో కలుపుతున్నారన్న అనుమానంతో వాటిని సీజ్ చేసి ల్యాబ్‌లకు పంపించారు. అంతేకాకుండా రాత్రి వండిన పదార్థాలు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచినట్లుగా విజిలెన్సు అధికారులు గుర్తించారు. ఇవన్నీ అవాస్తవమంటూ సీఈవో తెలిపారు.

## చదవడం మాకిష్టం

పెదవేగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనం విజ్ఞానానికి చిహ్నమని గ్రంథపాలకుడు టి.అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయానికి రావాలన్నారు. విజ్ఞానదాయకమైన పుస్తక పఠనంతో కలిగే లాభాలను వివరించారు.

## ముస్లింల ఆత్మీయ సమావేశం

చింతలపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వాటర్ ట్యాంకు వద్ద పామాయిల్ తోటలో పట్టణ ముస్లింల ఆత్మీయ సమావేశం జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు ముజాహిద్ మాట్లాడుతూ చెడు మార్గాన పయనించడం సరికాదని, మనదేశం సర్వమత సమ్మేళనమన్నారు. జామియా మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రహీం, ఎండీ అక్బర్ అలీ, పలువురు పాల్గొన్నారు.

# ముగిసిన కార్తీకం

▸▸ ఆట, పాటలతో సందడిగా సాగిన వన సమారాధనలు

ఏలూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సందడే సందడి చివరి కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో వన భోజనాలతో ఆనందంగా గడిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, కుల సంఘాలు ఏర్పాటు చేసిన వన సమారాధనలకు పెద్దఎత్తున తరలివెళ్లారు. వాతావరణం అనుకూలించడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా గడిపారు. చిన్నారులు, మహిళలకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందచేశారు. ఎటుచూసినా సందడి కనిపించింది. కార్తీక మాసంను పురస్కరించుకుని ఆఖరి ఆదివారం కావడంతో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో ఉత్సాహంగా కొనసాగాయి. దెందులూరు నియోజకవర్గంలో పలు తోటల్లో ఆయా వన సమారాధనలు నిర్వహించారు. చిన్న,పెద్ద తేడా లేకుండా ఆట పాటలతో అందరూ ఉత్సాహంగా గడిపారు. కొన్ని సంఘాలకు అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఆటపాటలతో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి కార్తీక ఆదివారం సందడిగా ముగిసింది.



వన సమారాధనలో యువత జోష్

## నేడు పోలిస్వర్గం నోము

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళలు కార్తీక మాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే నోము పోలిస్వర్గం నోము. ఆశ్వయుజ అమావాస్య మొదలుకొని కార్తీక అమావాస్య వరకు ప్రాతఃకాలంలో నదీ స్నానం చేసి దీపాలు వెలిగించలేనివారు ఈ పోలిస్వర్గం రోజు తెల్లవారుజామున నది, కాలువ, సముద్రం స్నానం ఆచరించి అరటి డొప్పలో దీపాలు వెలిగించి వదిలితే కార్తీక మాసమంతా స్నానమాచరించిన ఫలితం ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి. పోలి దీపాలను అమావాస్య రోజున కాకుండా మర్నాడు వచ్చే పాడ్యమి రోజు న వెలిగించుకోవాలి. ఆ రోజు బ్రాహ్మణులకు స్వయం పాకాలు, దీప దానాలు ఇచ్చి ఆశీర్వాదం పొందితే మంచి ఫలితాలు ఉంటాయి.

ఇందుకొక పురాణ కథ ఉందని రేవులింగేశ్వరాలయం అర్చకుడు వి.వెంకటేశ్వరశర్మ తెలిపారు. పురాతన కాలంలో ఒక మహిళకు ఐదుగురు కోడళ్ళు ఉండేవారని, వీరిలో ఆఖరి కోడలు పేరు పోలమ్మ. చిన్నప్పటి నుంచి పోలమ్మకు దైవభక్తి ఎక్కువ. పూలు కోయడం, పూజలు చేయడం తోనే ఆమె ఎక్కువ కాలం గడిచిపోయింది. వివాహమైన తరువాత అత్తకి ఈమెపై ఈర్ష్య కలిగింది. పూజలు, దీపారాధనలు చేసేందుకు సమయం కూడా ఇవ్వకుండా ఇంటి పనులు చేయించేది. పాడ్యమి రోజున అత్త నది స్నానానికి వెళ్తూ ఇంటి వద్ద పూజా సామగ్రిని ఉంచకుండా తీసుకువెళ్ళింది. అత్త వెళ్ళిన అనంతరం పాడ్యమి నాడు పోలమ్మ చెట్టుకు ఉన్న పత్తిని కోసి దీపం వెలిగించి తులసికోట వద్ద పూజ చేసి భక్తిని చాటుకుంది. నీటిలో అరటి డొప్పలు పెట్టిన దీపాలను వదిలింది.

ఆ రోజున దేవదేవులు పోలమ్మ పూజలు చేసి దీపారాధనలు చేసి తులసికోట వద్ద పూజించడంతో నెల రోజులు చేసిన ఫలితాన్ని ఆమెకు అందించి స్వర్గానికి తీసుకువెళ్ళినట్లు పురాణ కథ ఉందని చెప్పారు.

## బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే చంటి



ఎమ్మెల్యే చంటి దంపతులను సత్కరిస్తున్న ఐకాసా

ఏలూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం భగవంతుడి సేవలో ఉంటూ లోకక్షేమాన్ని కోరుకుంటూ తమ జీవితాలను దేవుడి సేవకి అంకితం చేసే బ్రాహ్మణ సమాజం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆదివారం దొండపాడు అద్దంకి రాంబాబు తోటలో ఏలూరునగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు కె.రవికుమార్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.మదన్ మోహన్, కోశాధికారి ఎస్వీ ప్రసాద్ పర్యవేక్షణలో తొలుత పార్థీవ లింగానికి రుద్రాభిషేకం తదుపరి రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు హాజరయ్యారు. చంటి మాట్లాడుతూ పేద బ్రాహ్మణులకు రేషన్ కార్డుల అందజేస్తామని, స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.2.50 లక్షలు రుణాలు ఇస్తామన్నారు. అనంతరం చంటి దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందచేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, టి.శ్రీనివాస్, ఎస్.దుర్గాప్రసాద్, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఎంబీఎస్ శర్మ, టి.రామకృష్ణ, ఐకాసా సభ్యులు పాల్గొన్నారు

## యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా : సొంగా



అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లింగపాలెం,డిసెంబరు01,(ఆంధ్రజ్యోతి):యువతకు ఉద్యోగాలు కల్పించి వారికి బంగారు భవిష్యత్తును అందించడమే లక్ష్యమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో 350 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీష్ భాషలలో మంచి పట్టుఉండి ఉద్యోగ అవకాశాలు లేని నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేలా చేయడమే తన లక్ష్యమన్నారు. పలు సంస్థలతో పాటు విదేశాలలో ఉద్యోగాలు చెయ్యాలనుకునే వారికి ఆంగ్ల భాషపైపట్టు సాధించుకొని తమలోని కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకొనేలా అవగాహన కల్పించారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలతో పాటు రాత పరీక్షలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు జి.చలపతిరావు, జి.బుజ్జయ్య, జీఎస్ఎస్‌వీ ప్రసాద్, ఎం.మల్లికార్జునరావు, జి.ముత్తారెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న సిబ్బంది

దెందులూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : అథ్లెటిక్స్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో సెయింట్ అగస్టీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఛాంపియన్ షిప్ సాధించారు. పెదపాడులోని సెయింట్ అగస్టీన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఏలూరులో జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థులు ఎనిమిది మంది ప్రతిభ కనబరిచారన్నారు. 40 మీటర్ల మర్బిల్ రేస్ అండర్-10 విభాగంలో బి.జీవన్ రెండోస్థానం, జె.దీక్షిత మూడో స్థానం, అండర్-14 విభాగంలో 60 మీటర్ల రన్నింగ్ రేస్‌లో జి.తనుశ్రీ మొదటి స్థానం, అండర్-16 విభాగంలో 80 మీటర్ల రన్నింగ్ రేస్‌లో జిలక్ష్మి ప్రియ మొదటి స్థానం సాధించారన్నారు. మిగిలిన అండర్-8,10,12,14 విభాగాల్లో 50 మీటర్ల పరుగు పందాల్లో మొదటి స్థానం సాధించి ప్రథమ స్థానంలో నిలిచి అథ్లెటిక్స్ ఛాపించాన్ షిప్ సాధించారని సెయింట్ అగస్టీన్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జసింతసుల్య తెలిపారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు

## సమస్యలు సత్వర పరిష్కారమే లక్ష్యం : చింతమనేని



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను సంబంధిత శాఖాధికారులకు తెలియపర్చి, తక్షణం పరిష్కరించే దిశగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెడుతుందన్నారు. పార్టీ నాయకులు బి.సుధాకర్, టి.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, ఎల్.శ్రీనివాసరావు, ఎం.నారాయణప్రసాద్, ఎన్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బిల్డింగ్ వర్కర్స్ సమస్య పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ అధ్యక్షులు (సీఐటీయూ) ఎన్.రమణారావు అన్నారు. అశ్వారావుపేట రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద ఆదివారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, సంక్షేమ బోర్డులు పూర్తి స్థాయిలో అమలు చేయటం లేదన్నారు. అందువలనే భవన నిర్మాణ కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ డిసెంబర్ 9న డివిజన్, మండల స్థాయిల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రాము, బుజ్జి, సూరిబాబు, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు సూర్యారావు, కార్యదర్శి సుభాషిణి పాల్గొన్నారు.

## ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయాలి

కుక్కునూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. ఆదివారం కూనవరంలొద్దిలో సమావేశం జరిగింది. ఇక్కడ ఆది వాసీలు మౌలిక సౌకర్యాలులేక తమ జీవితాలు నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారులు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. మండల కార్యదర్శి ఎం.వెంకటా చారి, పొన్నే లక్ష్మయ్య, జోగేష్, అర్జున్, బాబురావు పాల్గొన్నారు.

## పరామర్శ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి పి.సౌభాగ్యవతి, తల్లి అద్దంకి భూలక్ష్మి ఇటీవల మృతి చెందారు. పట్టణంలోని సౌభాగ్యవతి ఇంటికి ఆదివారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఆమెకు సూచించారు. ఎమ్మెల్యేతో పాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ, పగడం నాగేశ్వరరావు, పగడం దినేష్ ఉన్నారు.

## మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

కుక్కునూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకులు వై.నాగేంద్రరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రానికి నిత్యం మహిళలు పలు పనుల నిమిత్తం వస్తున్నారని వారికి కనీసం పబ్లిక్ టాయిలెట్‌లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. అలాగే కుక్కునూరు లోపల ఉన్న బస్టాండ్‌కి ప్రతీ బస్సు సర్వీసు వెళ్ళేలా చూడాలన్నారు. మండల కార్యదర్శి బి.శ్రీను, వైసాయికిరణ్, విశ్వనాథ్, తదిరతులు పాల్గొన్నారు.

## మహిళలకు మగ్గం, జర్దోసిలో ఉచిత శిక్షణ



శిక్షకురాలిని సత్కరిస్తున్న సత్యసాయి సంస్థ సభ్యులు

భీమడోలు, డిశంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఆర్థిక స్వావలంబన కలిగించాలని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు 37 రోజుల ఉచిత మగ్గం, జర్దోసిలో శిక్షణను ప్రారంభించారు. భీమడోలులోని గ్రామ దేవతల ఆలయాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా బర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు, ఏలూరు జిల్లా సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు శశిశేఖర్ పాల్గొన్నారు. భీమడోలు సత్యసాయిసేవా సమితి సభ్యులు జిల్లాలో సత్యసాయి సేవా కార్యక్రమాలను వివరించారు. సత్యసాయి సిల్క్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి నాగ ప్రసాద్, కెనరా, యుబీఐ బ్యాంకు మేనేజర్లు ఎంపీడీవో పద్మావతిదేవి, ఏలూరు జిల్లా సేవాదళ్‌కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సబ్‌జోన్ కన్వీనర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. 82 మంది విద్యావేత్తలకు, యువతకు ఈ శిక్షణ ఇస్తామన్నారు.

## అభిషేకాలు, అర్చనలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమావాస్య నేపథ్యంలో ఆదివారం నగరంలోని పలు డివిజన్లలో గల శివాలయాల వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, బిళ్వార్చనలు, దీపారాధనలు జరిపారు. సత్యనారాయణపేటలోని రేవులింగేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. పవరుపేటలోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద భక్తులు సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి సూర్యనమస్కార పూజలు నిర్వహించారు. వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. పురాణాలను పఠించారు. భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయాలన్నీ భక్తులతో పూజా కార్యక్రమాలతో కిటకిటలాడాయి.

## రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారికి ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం, అమావాస్య కావడంతో ఆ ప్రభావం అమ్మవారి దర్శనాలపై పడింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

## కల్యాణ మహోత్సవం

భీమడోలు, డిశంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలనులోని భ్రమరాంబమల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం ఆఖరి రోజు స్వామివారికి అమ్మవారికి కల్యాణమహోత్సవం జరిగింది. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భీమడోలు పార్వతీసమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# వ్యాధి రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలి



దెందులూరులో నర్సింగ్ విద్యార్థుల ఎయిడ్స్ నమూనా ప్రదర్శన

పెదవేగి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ రహిత సమాజ లక్ష్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ హెచ్ఐవీ తల్లి నుంచి బిడ్డకు కూడా సోకే ప్రమాదముందన్నారు. వ్యాధిని మాత్రమే ద్వేషించాలని, వ్యాధిగ్రస్తులను కాదన్నారు. ఏవో ఫాదర్ ఫెలిక్స్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్లీవరాజు, డాక్టర్ పావనసంధ్య, అధ్యాపకులు, దంతవైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

● దెందులూరు : ప్రతి ఒక్కరూ చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని బీఆర్ నర్సింగ్ కాలేజీ కరస్పాండెంట్ ఎస్.నూకరాజు అన్నారు. దెందులూరులోని విజయనగేష్ డీఈడీ, బీఆర్ నర్సింగ్ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కళాశాల అవరణలో ఆదివారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ఎయిడ్స్ నమూనా ప్రదర్శించారు.

● జంగారెడ్డిగూడెం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డిగ్రీ కళాశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ హనుమంతురావు, కళాశాల అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, వినయ్, జి.శ్రీనివాసరావు, జి.వెంకటలాల్, యూస్రీరాణి, సిహెచ్ రమాదేవి, శిరీష తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్ బేబి కమల ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సీఏస్ఆర్ఎమ్‌వో డాక్టర్ వి.రాంబాబు, డాక్టర్ సునీత, డాక్టర్ వజ్రకిరణ్, ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్, డీఎస్ఆర్‌సీ సిబ్బంది, రైడ్స్ ఎన్జీవో, సిబ్బంది పాల్గొన్నారు.

● భీమడోలు : భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన, ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. నా ఆరోగ్యం-నా హక్కు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ నివారణకు తగు సూచనలు, జాగ్రత్తలను సూచించారు. వైద్యులు రష్మి, కౌన్సిలర్ సింహాద్రి, సబిత, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : ఎయిడ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని బయ్యన్నగూడెం పీహెచ్‌సీ వైద్యులు సత్యనారాయణ కోరారు. అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తర్ణ అధికారి సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కూలీలకు పని కల్పించండి

టి.నరసాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలరాజుగూడెం ఉపాధి కూలీలకు వెంటనే పనులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.సుధారాణి డిమాండ్ చేశారు. ఏఎస్ఆర్‌నగర్‌లో ఆదివారం సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ నాయకులు జి.వెంకట్రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏడాదికి పైగా అప్పలరాజుగూడెం ఉపాధి కూలీలకు అధికారులు పనులు కల్పించడం లేదన్నారు. పనులు కల్పించాలని పలుమార్లు కూలీలు, అధికారులను అడిగినప్పటికి పనులు చూపటానికి జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని అడిగిన వెంటనే పని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా ఇదే తరహాలో పనులు లేక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మండలంలో పని కావాల్సిన ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కూలీలతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కూలీల పెండింగ్ వేతనాలు కూడా ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. మండల కమిటీ సభ్యులు ఎం.కుమారి, ఎ.మురళీ, పి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణరావుకు ఎస్టీఏ మద్దతు

ఏలూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థి గంధం నారాయణరావుకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్ తెలిపారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్‌గా 34 సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన నారాయణరావు రిటైర్ అయిన అనంతరం కూడా విద్యా సేవ చేస్తున్నారన్నారు. ఇటువంటి వ్యక్తి పెద్దలసభకు వెళితే విద్యారంగ అభివృద్ధికి తోడ్పడతారని మద్దతు ఇస్తున్నట్టు పేర్కొన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, డిసెంబరు01 (ఆంధ్రజ్యోతి): తుఫాను సమయంలో పంట కాపాడుకోనేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రతిధాన్యపు గింజ కొనుగోలు చేస్తామని లింగపాలెం మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలో మొత్తం 6,400 ఎకరాలలో వరి పంట సాగు చేశారని ఇప్పటి వరకు 1,325 ఎకరాలలో వరి పంట కోతలు జరిగాయన్నారు. తుఫాను కారణంగా తేమ శాతం 17 నుంచి 18 శాతం వరకు ఉన్నా ధాన్యం కొంటామన్నారు. రైతులు వరి కోతలు వాయిదా వేసుకుంటే మంచిదని ఇప్పటికే పంట కోసిన రైతులు పంటను తడవకుండా జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**క్రైమ్ కార్నర్**

## వేర్వేరు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు

చింతలపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కె.గోకవరంలో ఎక్సైజ్ అధికారులు దాడి చేసి బెల్టు షాపు నిర్వహిస్తున్న నాయుడు వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఆ బెల్టు షాపు నుంచి పది డ్యూటీ పెయిడ్ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

● జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు చిన్నవారిగూడెంలో దాడులు నిర్వహించి ఓ మహిళ వద్ద 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆమె పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. లక్కవరంలో ఓ మహిళ సారా అమ్ముతుండగా దాడి చేసి ఆమె వద్ద నుంచి లీటరు సారా స్వాధీనం చేసుకుని ఆమె పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్సైలు వెంకటలక్ష్మి, ఎస్.సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం : అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. కె.గోకవరంలో బెల్ట్ షాప్ నడుపుతూ అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి చేసినట్లు సీఐ తెలిపారు.

## కోడిపందేలపై దాడులు

జంగారెడ్డిగూడెం,డిశంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఉప్పలమెట్ట సమీపంలో జరుగుతున్న కోడి పందేలపై ఆదివారం పోలీసులు దాడి చేసి, నలుగురని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12 వేల నగదు, ఒక కోడిపుంజు, ఒక కోడి కత్తిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు. మైసన్నగూడెంలో కోడి పందేలపై దాడులు నిర్వహించిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3 వేల నగదు, ఒక కోడి పుంజు,ఒక కోడికత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పలు చోట్ల పేకాట ఆడుతున్న 20 మంది అరెస్టు

లింగపాలెం,డిసెంబరు01,(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెం శివారు వలసపల్లి అడ్డరోడ్డు వద్ద కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారమందడంతో పేకాట స్థావరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,500 నగదు, ఐదు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● పెదవేగి : కవ్వగుంటలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసి, రూ.5,200ల నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. జూదరులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

● ఏలూరు క్రైం : ఏలూరు సమీపంలోని వట్లూరులోని ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.9 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.



చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు

## జనాభాకనుగుణంగా న్యాయమూర్తుల సంఖ్య పెరగాలి

### సుప్రీం కోర్టు మాజీ జస్టిస్ చలమేశ్వర్

నరసాపురం , డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సత్వర న్యాయం జరగాలంటే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల సంఖ్య పెరగాలని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఆదివారం తెలగా కల్యాణ మండ పంలో నరసాపురం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దివంగత న్యాయవాది కొమాండూరి శ్రీనివాస్ చిత్రపట ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. న్యాయవ్యవస్థలో పరిస్థితులకు అనుగుణంగా సమర్థతను పెంపొందించాలన్నారు. ఇటీవల కాలంలో సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం పెరగడం వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నా యన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా న్యాయవాదులు వృత్తి నైపుణ్యాలు పెంచు కోవాలన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు సీనియర్లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అకుల వెంకట శేషసాయి మాట్లాడుతూ సీనియర్ న్యాయ వాదులు ఓపిక ఉన్నంత వరకు న్యాయస్థానాలకు రావాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ , ఏపీ బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులు చిదం బరం, జిల్లా అదనపు న్యాయమూర్తి విజయదుర్గా, న్యాయమూర్తులు గంగరాజు, వరలక్ష్మి, శ్రీనివాస్, బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు బాలాజీ, జీవికె రామారావు, కానూరి బాబ్జీ, కొత్తపల్లి రమేష్, పూరేళ్ళ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## చిన వెంకన్న ఆలయంపై డ్రోన్ కలకలం

### యూట్యూబ్‌లో వైరలైన వైనం

### ఇది పాత వీడియో : ఈవో మూర్తి


విచారణ చేస్తున్న తహసీల్దారు సుబ్బారావు

ద్వారకాతిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంపై డ్రోన్ ఎగిరిందన్న వార్త ఆదివారం దుమారాన్ని రేపింది. శేషాచలంపై ఓ యూట్యూబర్ డ్రోన్‌ను ఎగురవేసి ఆ విజువల్స్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. డ్రోన్ ఎగుర వేసిన యూట్యూబర్ పైనా...పట్టించుకోని భద్రతా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అయితే దీనిపై ఆలయ ఈఓ మూర్తి వివరణ ఇస్తూ అన్ని రకాలుగా విచారణ చేశామని ఇది ఎప్పుడో పాత వీడియో అని.. ఇటీవల తీసింది కాదని గుర్తించామన్నారు. అది డ్రోన్ వీడియో కాదని.. లాంగ్ షాట్ వీడియో అని వివరణ ఇచ్చారు. అయితే ఈ ఘటనపై కలెక్టర్ విచారణ జరపాలని ఆదేశాలివ్వడంతో తహసీల్దారు సుబ్బారావు అన్ని కోణాల్లో దీన్ని పరిశీలించి నివేదిక పంపారు. యూట్యూబ్‌లో ఈ వీడియోలు తొలగించినట్టు తెలిసింది.

## సూర్యనారాయణరాజు పేరిట ట్రస్టు ఏర్పాటు

### తండ్రి సంస్మరణ సభలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ


మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి భూపతిరాజు సూర్యనారాయణ రాజు పేరిట ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రకటించారు. తన తండ్రి సూర్య నారాయణరాజు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. కార్యకర్తగా ప్రస్తానం ప్రారంభించి తండ్రి ప్రో త్సాహంతో ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. తన పరిధిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రోజు సమయం కేటాయించి పని చేస్తానని కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పథంలో తీసుకువెళతానన్నారు. సంస్మరణ సభలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, సోము వీర్రాజు, మాధవ్, జివిఎల్ నరసింహరావు, మంతెన రామరాజు పాల్గొన్నారు.

## ముంబయి ఎయిర్ బస్ ప్రారంభించిన మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేవలం రెండు గంటల్లోనే రాజ మహేంద్రవరం నుంచి ముంబయికి వెళ్లవచ్చని రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మధురపూడి విమానాశ్రయం నుంచి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు తొలిసారిగా ముంబయికి నేరుగా విమాన సర్వీసును ప్రారంభించి మాట్లాడారు. ఎయిర్ బస్సు సర్వీసుతో రాజమహేంద్రవరం -ముంబయికి మధ్య దూరం తగ్గిందన్నారు. ఈ నెల 12 నుంచి న్యూఢిల్లీకి ఇక్కడ నుంచి విమాన సర్వీసు ఆరంభ మవుతుందన్నారు. కేంద్రమంత్రి రామ్మో హన్‌నాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పట్టుదలతో ఎయిర్‌బస్ సర్వీసు వేశారన్నారు. ఎయిర్ పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 4.50 గంటలకు ముంబయి నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు 6.45 గంటలకు చేరుతుందన్నారు. ఈ ఎయిర్‌బస్సు రాత్రి 7.15 గంటలకు ఇక్కడ నుంచి తిరిగి బయలుదేరి రాత్రి 9.05 గంటలకు ముంబయి చేరుకుంటుందని చెప్పారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వర రావు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నేతలు నీరుకొండ వీరన్నచౌదరి, జవ్వాది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


అధ్వానంగా ఉన్న రహదారి

## ఈ రహదారి గతి ఇంతేనా..?

### సరిహద్దు రహదారిపై పట్టించుకోని రెండు పంచాయతీలు

### నరకం చూస్తున్న స్థానికులు


నూజివీడు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గ పరిధిలోని నూజివీడు, ముసునూరు మండలాల పంచాయతీల సరిహద్దుల్లో ఉన్న రహదారి అభివృద్ధిపై ఆ రెండు పంచాయతీలు శీతకన్ను వేయడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు మండలాల సరిహద్దుల్లో ఉన్న సింహాద్రిపురం గ్రామ హెల్త్ సెంటర్‌కు వెళ్లే రహదారి నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి, ముసునూరు మండలం కొర్లకుంట పరిధిలో ఉంది. అయితే ఈ పంచాయతీలు రహదారి అభివృద్ధిపై కనీసం దృష్టి పెట్టకపోవడంతో రహదారి బురదకయ్యగా మారి నడవడానికి వీలులేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇరు పంచాయతీలు ఎవరికి వారు సంబంధం లేనట్లు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించి రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

## కంద తాబేలు



కలిదిండిలో ఆదివారం ఓ వ్యాపారి కూరగాయల దుకాణంలో తాబేలు ఆకారంలో ఉన్న కంద దుంప లభ్యమైంది. ఆదివారం అమావాస్య కార్తీక మాసం చివరి రోజున కూర్మావతారంలో కంద దుంప లభ్యమవటం అద్భుతంగా భావిస్తున్నారు.

-కలిదిండి



చెక్కపల్లిలో మోటారు కేబుల్‌ను కట్ చేసిన దృశ్యం (ఇన్‌సెట్) గోపవరంలో ఫ్యూజులు పగులకొట్టి రాగి వైర్ చోరీ చేసిన దృశ్యం

## పోలీసులూ.. పట్టుకోండి చూద్దాం!

- ఆగని రాగివైర్ల చోరీ
- లబోదిబోమంటున్న అన్నదాత
- ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆక్రోశం
- పెట్రేగిపోతున్న దుండగులు

ముసునూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ బోర్లకు సంబంధించిన సామగ్రిలో రాగివైర్ల చోరీలు ఆగడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో జరిగే రాగి వైర్ల చోరీలు ఒక్కరోజే సుమారు 10 నుంచి 20 బోర్ల వరకు జరుగుతున్నాయి. దుండగులు విద్యుత్ మోటారుకు సంబంధించిన కేబుల్ వైర్, ఫ్యూజుల్లో ఉన్న రాగివైర్‌ను సైతం దొంగిలించుకుపోతున్నారు. వీటి విలువ రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ముసునూరు, గోపవరం, సూరేపల్లి, కొర్లకుంట, తాళ్ళవల్లి, గోగులంపాడు, అక్కిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో సుమారు 1200 వ్యవసాయ బోర్ల సామగ్రి చోరీ అయింది. ఇటీవల చెక్కపల్లిలో ఒక్క రాత్రే 40 బోర్ల సామగ్రిని అపహరించుకుపోయారు. ఒకవైపు ఆర్థికంగా నష్టపోతూ, మరోవైపు పంటకు నీరందించలేని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. గత ఐదేళ్లుగా ఈ చోరీలు జరుగుతున్నా పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటి వరకు ఒక్క దొంగను కూడా పట్టుకోలేదని బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ బోర్ల రాగివైర్లు చోరీలను నియంత్రించేలా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న న్యాయాధికారి వెంకటేశ్వరరావు


కలిదిండిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

## అవగాహనతోనే ఎయిడ్స్‌కు చెక్

నూజివీడు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు ఏరియా ఆసుపత్రిలో మండలం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీలను నిర్వహించారు. ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎయిడ్స్‌పై అవగాహనతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని తద్వారా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మనోధైర్యాన్ని అందించాలన్నారు. ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ నరేంద్ర సింగ్, పట్టణ ఎస్సై జ్యోతిబస్సు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది న్యాయవాదులు పాల్గొన్నారు.

**కలిదిండి:** ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి జాహ్నవి అన్నారు. ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం కలిదిండిలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## మహాదేవుడికి భస్మాభిషేకం

మండవల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండవల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహాదేవునికి భస్మాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. కార్తీకమాసం ఆఖరి రోజు సందర్భంగా పండితులు గుడూరి భవానీశాస్త్రి, కామేశ్వర శర్మ, భరద్వాజ్ ఆధ్వర్యంలో భస్మాభిషేకం చేశారు. గణపతికి, స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజాహక్కుల సభను జయప్రదం చేయండి

**ముసునూరు:** సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 4న విజయవాడలో నిర్వహించే ప్రజాహక్కుల సభను జయప్రదం చేయాలని ఐసా జిల్లా కార్యదర్శి గరిక అఖిల్ పిలుపు నిచ్చారు. ఆది వారం ఆయన రమణక్కపేటలో మాట్లాడుతూ సభకు విద్యార్థులు, యువజనులు, కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. శ్రీను, నరసయ్య, వంశీ, తిరుపతిరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి చెరువు నింపారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పెదలంకలో నిండిన తాగునీటి చెరువు

కలిదిండి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువును సర్పంచ్ మోకా లక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు, గ్రామ పెద్దల సహకారంతో పూర్తిస్థాయిలో నింపారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 25న పెదలంకలో దాహం దాహం శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కోరుకొల్లు లాకుల నుంచి సీబీ కెనాల్‌కి తాగునీటిని విడుదల చేసి పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువుకు నీటి వంతు ఇచ్చారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా రేయింబవళ్లు కాల్వ వెంబడి మూడు రోజులపాటు కాపలా కాస్తూ యుద్ధప్రాతిపదికన మోటార్లతో తాగునీటి చెరువును నింపారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హైందవ శంఖారావం జయప్రదం చేయండి


మాట్లాడుతున్న పాములు

ముదినేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని శంఖారావం నిర్వాహక కమిటీ కో-కన్వీనర్ మేడిశెట్టి పాములు కోరారు. ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన మండల వీహెచ్‌పీ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని కాపాడటం హిందువుల కర్తవ్యమన్నారు. ఆలయాలను పరిరక్షించుకోవాలన్నారు. శంఖారావం మండల కన్వీనర్ దివి సతీష్, ప్రతినిధులు పుష్పాల శేషు, వడ్లాని ఆంజనే యులు, కోటమర్తి చక్రధారి తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ముసునూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడులో కొల్లి వెంకయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో అతని మనవడు కొల్లి మారుతి బాబు సహకారంతో ఆదివారం ఏలూరు ఆయుష్ ఆసుపత్రి వైద్యులతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య బృందం బీపీ, షుగరు, గుండె సమస్యలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



## ప్రవక్త జీవితం ఆదర్శం కావాలి

ముదినేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం జమాత్ ఉమ్మడి కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ముదినేపల్లి మండలం పెయ్యేరులో వయోజనుల వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు మహ్మద్ యాకూబ్ బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు రిజ్వాన్ సలీం, ఇన్‌చార్జ్‌లు ఎంఎ జాఫర్ ఖాన్, మహ్మద్ జావిద్ అహ్మద్, ప్రజా సంబంధాల అధికారి మహ్మద్ అక్బర్, తూర్పు గోదావరి జిల్లా యూత్ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్ తదితరులు పాల్గొని ప్రవక్త హజ్రత్ మహమ్మద్ ముస్తాఫా జీవితం అందరికీ ఆదర్శం కావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం వయోజనులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## ఐక్యతకు చిహ్నం క్రిస్మస్ : ఎమ్మెల్యే కామినేని



కైకలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ ఐక్యతకు చిహ్నం అని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి నీలం కుమార్, ఓగిరాల శ్రీకాంత్, సదర్ల సూరి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జానీ, కూటమి నేతలు పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కమ్మిలి విఠల్‌రావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్

కైకలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల యువతలో ఉత్సాహం పెరుగుతుందని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పుట్టిన రోజును పురస్కరించుకుని కైకలూరులో మూడు రోజుల పాటు నిర్వహించే వాలీబాల్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి, రెండవ, మూడవ, నాలుగవ బహుమతులను అందజేయనున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల పట్ల యువత మక్కువ చూపాలన్నారు. కూటమి నేతలు టీకేఎం నాని, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, మంగినేని రామకృష్ణ, వేల్పూరి చంద్రరావు, కాళ్ళపాలెం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత అనుమానాస్పద మృతి


మేరీ (ఫైల్)

ముసునూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ముసునూరు మండలం గుడిపాడులో ఆదివారం చోటు చేసుకుంది. నూజివీడు పట్టణానికి చెందిన నల్లపు మేరి(35)కి, గుడిపాడుకు చెందిన పెనుమాల గిరికి 20 ఏళ్ళ క్రితం వివాహమైంది. అయితే గిరి వివాహేతర సంబంధం పెట్టుకుని, మద్యం సేవిస్తూ, భార్య మేరిని రెండేళ్లుగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. పెద్దల సమక్షంలో మూడుసార్లు పంచాయతీ పెట్టి గిరిని హెచ్చరించినా అతని తీరు మారలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తన భార్య చనిపోయిందని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. నూజివీడు సీఐ రామకృష్ణ, ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి, నూజివీడు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మేరీ మృతదేహాన్ని పరిశీలించి, చుట్టుపక్కల విచారించారు. మేరీ హత్య చేయబడిందని, ఆమె మెడపై వైర్‌తో ఉరివేసినట్లు అనుమానంగా ఉందని కుటుంబసభ్యులు ఆరోపించారు. తన అక్కను గిరి ఉరివేసి చంపాడని మృతిరాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మేరీ మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. అయితే ఇంటిలో ఉన్న బియ్యపు డ్రమ్ములో వైర్ ఉన్నట్టు గుర్తించిన పోలీసులు గిరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

### బెల్లం ఊట ధ్వంసం

నూజివీడు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 1,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. పోలవరం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో తప్పించుకున్న కలకొల్లు రెడ్డియ్యపై కేసు నమోదు చేశామని తెలిపారు. చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల్లో కల్లు శాంపిల్స్‌ను తీసుకొని పరీక్షలకు పంపామన్నారు.

### 52 కేసుల నమోదు

**నూజివీడు:** నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నవంబరు నెలలో 52 కేసులు నమోదైనట్లు అందులో 25 సారా కేసులేనని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 17 మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 87 లీటర్ల సారా స్వాధీన పరుచు కున్నట్లు తెలిపారు. దాడుల్లో 12,810లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 22 బెల్టుషాపుల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 331 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని 31తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, 40 మంది పాత నేరస్తులను ఆయా మండలాల తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.


విద్యుద్దీపాలంకరణతో స్వాగత ద్వారం


ఆలయం వద్ద పుట్ట


సింగరాయపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం


కల్యాణ వేదిక

## షష్టికి ముస్తాబు

ముదినేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ముదినేపల్లి మండలం సింగరాయపాలెం-చేవూరు పాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం షష్టి ఉత్సవాలకు ముస్తాబవుతున్నది. ఈ నెల 6 నుంచి 18 వరకు జరుగనున్న ఈ మహోత్సవాలకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచే కాక, రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పుట్టలో పాలు పోయటం ప్రారంభమయ్యే 7వ తేదీన సుమారు 40 వేల మంది భక్తులు వస్తారన్న అంచనాలతో తొక్కిసలాట లేకుండా పటిష్ఠ ఏర్పాట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. దేవస్థానం ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించటంతోపాటు పరిసరాల్లోని అన్ని రహదారుల్లో విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల సమయంలో నిత్యం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు మండపాన్ని తీర్చిదిద్దుతున్నారు.